హఠాత్తుగా పాటందుకుంది సీత "అమ్మనీ కమ్మనీ దెబ్బ...ఎంత వెచ్చగా వుందిరోయబ్బ పురుషుల్లో పుంగవా?"

ఆపాట వినగానే బుచ్చిబాబుకి గాభరా ఎత్తిపోయింది. లబలబలాడ్తూ బయటకి పరుగు తీశాడు.

"ఏంటా పాటా? మానాన్నగారు విన్నారంటే ఈ క్షణమే నిన్ను ఇంట్లోంచి గెంటేస్తారు!" అన్నాడు సీతతో ఎగశ్వాస పీలుస్తూ.

"ఏం? ఈ పాటకేమైంది? మంచి హిట్‌సాంగే పాడుతున్నాగా?" వేస్తున్న ముగ్గు ఆపి ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది సీత.

"హిట్ సాంగే. కానీ పాట పాడ్డానికి ఇది సమయమూ కాదు. సందర్భము కాదు. ముగ్గేసేటప్పుడు పాడే పాటేనా అది?"

సీత నాలుక కొరుక్కుంది.

"నువ్వు ముందే చెప్పొద్దూ మీ నాన్నగారు వింటే ఎంత డేంజర్ అయ్యుండేది?" బుచ్చిబాబు మీద విసుక్కుంది.

"నాకేం తెల్సు..... నువ్వింత సిల్లీగా ఘోరమైన పాట పాడ్తావని?" నెత్తి కొట్టుకున్నాడు బుచ్చిబాబు.

"సరే అలాగైతే ముత్యమంత పసుపు, ముఖమెంత ఛాయ, ముత్తయిదు కుంకుమా బ్రతుకంత ఛాయా పాడనా!?"

"వెరీ గుడ్... అది కానియ్!" అంటూ లోపలికి పరుగుతీశాడు బుచ్చిబాబు.

సీత "ముత్యమంతా పసుపు" అంటూ పాటెత్తుకుని ముగ్గెట్టడం మొదలుపెట్టింది. పల్లవి పూర్తయిందో లేదో లోపలి నుండి పర్వతాలరావు గావుకేక పెట్టాడు.

"ఒరేయ్ తెల్లారే ఆ వెధవ టేప్‌రికార్డర్ పెట్టావేంట్రా సోంబేరి వెధవా...ముందు దాన్ని కట్టెయ్"

బుచ్చిబాబు పరుగున బెడ్‌రూంలోకి వెళ్ళి "అది టేప్ రికార్డర్ కాదు నాన్నా..." అన్నాడు ముసిముసిగా నవ్వుతూ.

"కాకపోతే మరేంట్రా?" అడిగింది పార్వతమ్మ నిద్ర కళ్ళేసుకుని ఆవలిస్తూ.

"మీరే ఓసారి బయటకొచ్చి చూడండి" అన్నాడు బుచ్చిబాబు సంబరంగా.

వరండాలోకి వచ్చి వాకిట్లో తలంటుకుని పెద్దబొట్టు పెట్టుకుని పాటపాడుతూ ముగ్గు పెడుతున్న సీతని చూసిన పర్వతాలరావు, పార్వతమ్మ అలానే నోరు తెరచుకుని చూస్తూ నిలబడిపోయారు.

వాళ్ళు అలా నోరు తెరుచుకుని ఆశ్చర్యంతో మునిగుండగానే సీత ముగ్గు పెట్టడం పూర్తిచేసి దేవుళ్ళకి పూజకూడా చేసేసి హారతి పళ్ళెం వాళ్ళిద్దరి దగ్గరికి తెచ్చింది.

"హారతి తీస్కోండి" అంది సీత.

వాళ్లిద్దరూ ఈలోకంలోకి వచ్చి కంగారు కంగారుగా హారతిని కళ్ళకద్దుకున్నారు.

సీత ఇద్దరి చేతిలో ప్రసాదం పెట్టింది. ఇద్దరూ గబుక్కున ప్రసాదం నోట్లో వేసుకుని తర్వాత పళ్లు తోముకోలేదని గుర్తొచ్చి నాలుక కొరుక్కున్నాడు.

"ఒరేయ్ బుచ్చీ! సీత నాకు నచ్చిందిరా" అన్నాడు పర్వతాలరావు మెరిసే కళ్ళతో బుచ్చిబాబు వంక చూస్తూ.

"యాహూ!"

గుండెలు బద్దలయ్యేలా కేక పెట్టాడు బుచ్చిబాబు.

## 4

బుచ్చిబాబు మేనేజర్ ఏకాంబరం క్యాబిన్‌లోకి వెళ్ళాడు, అతని చేతిలో స్వీట్స్ బాక్స్ వుంది.

"రావోయ్ రా... ఏంటి చేతిలో స్వీట్స్ బాక్స్ వున్నట్టుందే? ఏంటి విశేషం?" అన్నాడు బుచ్చిబాబు వంక చూసి కళ్ళెగురవేస్తూ ఏకాంబరం.

"అంటే... అదీ...మరీ" కాస్త మెలికలు తిరుగుతూ ఆ తర్వాత స్వీట్స్ ముందుకు పెడ్తూ" నా పెళ్ళి కుదిరిందండీ" అన్నాడు బుచ్చిబాబు.

"హోరి-అలాగటోయ్?" ఏకాంబరం బాక్స్‌లోంచి ఓ స్వీట్ తీసుకున్నాడు.

"నువ్వొట్టి టింగారి టింబివోయ్!"

"ఎంటిసార్... పెళ్ళి చేస్కుంటున్నందుకు నన్ను పొగుడ్తున్నారా సార్" సంబరంగా అడిగాడు బుచ్చిబాబు.

"కాదు తిడ్తున్నాను. టింగారి టింబి అంటే తెలివితక్కువ సన్నాసి అని అర్థం!"

ఏకాంబరం స్వీట్ ముక్క కొరికాడు.

"అదేంటి సార్? అలా అనేసారు?" బుచ్చిబాబు అయోమయంగా మొహం పెట్టాడు.

"అవును మరి టింగారి టింబిలే పెళ్ళి చేస్కుంటారు..."

"అంటే మీరు కూడా?"

"అవును.....నేను కూడా టింగరి టింబినే ఒట్టి టింగారి టింబినే కాదు... టింగారి టిస్కి టిస్కి టింబినే...ఎందుకంటే పెళ్ళి చేస్కోడం వట్టి తెలివితక్కువ పని అని తెలిసి చేస్కున్నాను".

"టింగారి టిస్కి టింబి అంటే ఏంటి సార్?" కుతుహలంగా అడిగాడు బుచ్చిబాబు.

"వద్దు నేను చెప్పను. చెప్తే నా పరువు పోతుంది. ఈమాత్రం దానికే ఏదో పెద్ద ఘనకార్యం చేసినట్లు స్వీట్లు! ఏది బాక్సు?"

బుచ్చిబాబు స్వీట్ బాక్సుని అతని ముందుకి చాపాడు.

ఏకాంబరం  అందులోంచి మరో స్వీటు ముక్కని తీసుకుని నోట్లో కుక్కుకున్నాడు.

"బెబ్బెబ్బుబూ?" నోటినిండా స్వీటుంచుకుని అడిగాడు ఏకాంబరం

"ఫర్వాలేదు. స్వీటు తిన్నాకే అడగండి సార్" వినయంగా అన్నాడు బుచ్చిబాబు .

ఏకాంబరం స్వీటు మింగేసాడు "అదే పెళ్ళెప్పుడు అని అడుగుతున్నా!"

"ఇంకా ముహూర్తం నిర్ణయించలేదు సార్!"

"శుభం. వీలైనంత దూరంగా పెట్టుకో" అని ఫైళ్లలో తల దూర్చేసాడు ఏకాంబరం.

ఆ తర్వాత ఆఫీసు మిగతా స్టాఫ్ అందరికి స్వీట్స్ పంచి విషయం చెప్పాడు బుచ్చిబాబు .

వాళ్ళల్లో "అహా అలాగటోయ్? కంగ్రాట్స్!" అన్నవాళ్ళూ వున్నారు.

"అయ్యోపాపం? అయితే ఇరుక్కుపోతున్నావన్నమాట" అన్నవాళ్ళు కూడా వున్నారు.

వాళ్ళ కామెంట్స్ అతను పట్టించుకోలేదు. అతను సంతోషంగానే వున్నాడు.

సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికెళ్ళడానికి బస్టాండ్‌కి వెళ్తుండగా వెనుక నుంచి "బుచ్చిబాబు" అని పిలుపు వినిపించింది.

బుచ్చిబాబు ఆగి వెనక్కి తిరిగి చూసాడు. వెంకట్రావ్!

నవ్వుతూ ఆగమనట్లుగా సైగ చేస్తున్నాడు. బుచ్చిబాబు ఆగాడు. వెంకట్రావ్ గబగబా అడుగులు వేస్తూ బుచ్చిబాబుని చేరుకున్నాడు. వెంకట్రావ్ బుచ్చిబాబు ప్రక్క సెక్షన్లో పని చేస్తాడు.

"ఏంటోయ్ బుచ్చిబాబు నీకు పెళ్ళి కుదిరిందిటగా? మీ సెక్షన్లో అందరికి స్వీటు పంచావన్నమాట మరి మాకేం లేదా?" అడిగాడు వెంకట్రావు.

బుచ్చిబాబు ఇబ్బందిగా నవ్వాడు.

"స్వీటేగా..దాందేముందిలే" అన్నాడు.

"బస్టాండుకేగా?... పద నేను కూడా వస్తాను"

ఇద్దరూ అడుగులు ముందుకు వేసారు.

"అమ్మాయేం చేస్తోంది?" అడిగాడు వెంకట్రావ్.

బుచ్చిబాబు సీత  గురించి చేస్తున్న ఉద్యోగం గురించి వెంకట్రావ్‌కి చెప్పాడు.

"అబ్బో! అయితే కష్టమేనే. అసలే నీకు విజయవాడకి ట్రాన్స్‌ఫర్ వచ్చింది. నువ్వేమో అక్కడ, ఆమేమో ఇక్కడ!!"

"అదే ఆలోచిస్తున్నా...ఏం చేయాలా అని, పెళ్ళి చేసుకున్నాక నేనక్కడ తానిక్కడ అయితే ఏం బాగుంటుంది చెప్పు సిల్లీగా?"

"ఇందులో ఆలోచించడానికేముంది... నీ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ క్యాన్సిల్ చేయించుకోవడమే!"

"కుదుర్తుందా? మన ఏకాంబరంగారిని అడిగితే  వీల్లేదు. ఇది హెడ్డాఫీసు ఆర్డర్ అన్నాడు సిల్లీగా"

"అడక్క అడక్క వాడినే అడిగావ్? మనకర్థం కాని వింత వింత తిట్టు తిట్టడానికి తప్ప వాడెందుకూ పనికిరాడు. అయినా నాకు ఒకటి రెండు సోర్సులున్నాయిలే. వాటి ద్వారా ప్రయత్నించవచ్చు" అన్నాడు వెంకట్రావు.

ఆ మాట వినగానే బుచ్చిబాబు రోడ్డుమీద ఠక్కున ఆగిపోయాడు.

"చూసావా.... నాలో నేను సిల్లీగా మధనపడిపోతున్నానేగానీ నిన్ను ఓ మాటడుగుదామనే ఆలోచనే నాకు రాలేదు?"

"పద లోపల కూర్చుని ఏదైనా తింటూ మాట్లాడుకుందాం"

"స్వీట్స్ ఫ్రెష్‌గా ఏమున్నాయోయ్?" సర్వర్‌ని అడిగి "ఇందాక మాకేం స్వీట్స్ లేవా అని అన్నావ్‌గా?" అంటూ వెంకట్రావ్‌ను చూసి నవ్వాడు బుచ్చిబాబు.

"బాసుంది ఫ్రెష్‌గా వుంది సార్... జాంగ్రీ కూడా బాగుంది సార్" చెప్పాడు సర్వర్.

"రెండు బాసుంది తీసుకురా అయిదు నిముషాలయ్యాక రెండు మసాలా దోసెలు కూడా తీసుకురా" ఆర్డర్ ఇచ్చాడు బుచ్చిబాబు.

"అలాగే సార్" అంటూ వెళ్ళిపోతున్న సర్వర్‌ని వెంకట్రావ్ వెనక్కి పిలిచాడు.

"ఏం సార్?" అడిగాడు సర్వర్.

"నాకు జాంగ్రీ కూడా తీసుకురా!" చెప్పాడు వెంకట్రావు.

సర్వర్ అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

"చెప్పు ఏదో సోర్సు వుందన్నావ్ ఏంటది?" కుతుహలంగా ముందుకు వంగుతూ అడిగాడు బుచ్చిబాబు.

"ఓ పని చేద్దాం..." అని రెండు క్షణాలు ఆగాడు వెంకట్రావ్.

బుచ్చిబాబు ఆత్రంగా వెంకట్రావ్ మొహంలోకి  చూసాడు ఏం చెప్తాడోనని.

"చార్‌మినార్ చౌరస్తా దగ్గర యాదగిరి వున్నాడు. అతన్ని కలుద్దాం"

"యాదగిరి ఎవరు? మినిస్టరా?" ఉత్సాహంగా అడిగాడు బుచ్చిబాబు.

"కాదు! కిళ్ళీకొట్టువాడు" చెప్పాడు వెంకట్రావు.

బుచ్చిబాబు ఉలిక్కిపడ్డాడు.

"కిళ్ళీకొట్టువాడా? వాడు నా ట్రాన్స్‌ఫర్ ఎలా ఆపుతాడు?"

ఇంతలో సర్వర్ అక్కడికి వచ్చి ఇద్దరి ముందూ రెండు బాసుందీ కప్పులూ, ఒక జాంగ్రీ ప్లేటు పెట్టాడు.

"అసలు ఒక కిళ్ళీకొట్టువాడు...." బుచ్చిబాబు మళ్ళీ అడగబోయాడు.

వెంకట్రావ్ బుచ్చిబాబు వంక చాలా సీరియస్‌గా చూసాడు.

"ముందు నన్ను తిన్నిస్తావా?"

బుచ్చిబాబు బుస్సున నిట్టూర్చి బుర్రకాయ్ ఊపాడు సరేనన్నట్లు. వెంకట్రావ్ స్వీటు ప్లేట్లు దగ్గరికి లాక్కున్నాడు. బుచ్చిబాబు కూడా బాసుంది ప్లేటు దగ్గరకు లాక్కుని స్పూన్‌తో కాస్త

నోటిలో వేసుకున్నాడు. వెంకట్రావ్ బాసుంది, జాంగ్రీ లపక్ లపక్ మని, చప్పరించుకుంటూ తినేదాకా చాలా ఓపిగ్గా ఎదురుచూశాడు బుచ్చిబాబు.

వెంకట్రావ్ మంచినీళ్ళు గటగటా త్రాగి ఖాళీగ్లాసు టేబుల్‌మీద పెట్టి "స్వీట్స్ చాలా బాగున్నాయోయ్" అన్నాడు బుచ్చిబాబుతో.

"అవునా.....హిహి!" పైకి అని మనసులో హమయ్య అనుకున్నాడు బుచ్చిబాబు.

"అసలు ఇంతకీ ఒక కిళ్ళీకొట్టువాడు నా ట్రాన్స్‌ఫర్..."

బుచ్చిబాబు ఏదో అడగబోయేంతలో సర్వర్ వేడివేడిగా రెండు దోసెలు తెచ్చి వీళ్ళ టేబుల్ మీద వుంచాడు.

"ఉండు. ఇప్పుడు నీకు చెపుతూ కూర్చుంటే దోసెలు చప్పగా చల్లారిపోతాయ్" అని బుచ్చిబాబు మీద విసుక్కుని వెంకట్రావ్ దోసె ప్లేటు లాక్కుని ఓ ముక్క తుంపి నోటిలో వేసుకుని పచక్...పచక్ మని నమిలాడు.

బుచ్చిబాబు సర్వర్ వంక సీరియస్‌గా చూసాడు.

"ఏం సార్ అలా చూస్తారు. చాలా త్వరగా తెచ్చానుకదా. అసలు మా హోటల్లో ఉండేంత క్విక్ సర్వీస్ ఎక్కడా వుండదు తెల్సా?" అంతకంటే చికాకుగా చూస్తూ బుచ్చిబాబుతో అన్నాడు సర్వర్.

నువ్వు పానకంలో పుడకలా త్వరత్వరగా తెస్తున్నందుకే నాకు చిరాకు పుట్టిందిలే నాయనా అని మనసులో అనుకున్నాడు బుచ్చిబాబు.

దోసెలు తినడం పదినిముషాలపాటు సాగింది. తర్వాత కాఫీలు. అదీ అయ్యాక వెంకట్రావ్ బ్రేవ్‌మని త్రేన్చాడు.

ఆ ప్రహసనం మొత్తం అక్కడితో అయిపోయినందుకు బుచ్చిబాబు ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు. సర్వర్ బిల్ తెచ్చి వెంకట్రావ్ ముందు పెట్టబోతే "అక్కడ... అక్కడా" అని బుచ్చిబాబు చూపించాడు.

బుచ్చిబాబు బిల్ పే చేసాడు.

"ఇంక మనం పోదామా?" అంటూ వెంకట్రావ్ లేవబోయాడు.

బుచ్చిబాబు కంగారుగా లేచి వెంకట్రావ్ భుజాలమీద చేతులేసి బలంగా నొక్కి సీటులో కూలేసాడు.

"ఏంటి వెళ్ళిపోదామంటున్నావ్?" లోలోపల మండిపడుతున్నా పైకి నవ్వుతూ అంటూ తనూ కూర్చున్నాడు బుచ్చిబాబు.

"వెళ్ళాక? కొంపదీసి ఇంకా తినిపిస్తావా ఏంటి? నావల్లకాదు బాబూ...కడుపు ఫుల్ అయిపోయింది" బొజ్జమీద అరచేయి తిప్పుతూ తృప్తిగా అన్నాడు వెంకట్రావ్ .

"ఇప్పుడు తినడం గురించి కాదు నిన్ను ఆపింది. ఆ యాదగిరి గురించి ఏదో చెప్పుతున్నావుకదా విందామని" బలవంతంగా నవ్వుతూ అన్నాడు బుచ్చిబాబు .

"ఏ యాదగిరి?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు వెంకట్రావు.